క్లుప్తంగా

కోవిడ్ కార్మికులను ఆప్కోస్‌లో చేర్చాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

చీమకుర్తి: కోవిడ్ కార్మికులను ఆప్కోస్‌లో చేర్చాలని ఆదివారం సీఐటీయూ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. గత ఐదు సంవత్సరాలుగా పనిచేస్తున్న కోవిడ్ కాలంలో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయాలని కమిషనర్ రామకృష్ణయ్యకు విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ నాయకులు పూసపాటి వెంకట్రావు ఆధ్వర్యంలో కార్మిక సంఘం నాయకులు పద్మ, ఏడుకొండలు, కార్మికులు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

మాగుంట సుబ్బరామరెడ్డికి ఘన నివాళులు



దివంగత ఎంపీ మాగుంట సుబ్బరామరెడ్డికి నివాళి అర్పిస్తున్న నాయకులు

సంతనూతలపాడు: దివంగత ఎంపీ మాగుంట సుబ్బరామరెడ్డి 29వ వర్ధంతిని పురస్కరించుకొని సంతనూతలపాడులో మాగుంట సుబ్బరామరెడ్డి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో పలువురు సుబ్బరామరెడ్డికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి ఎమ్మెస్సార్ కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ లో మాగుంట సుబ్బరామిరెడ్డి, రాజీవ్ గాంధీ, ఇందిరాగాంధీ, గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీమకుర్తి మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల డైరెక్టర్ వి.వి.శివారెడ్డి, అధ్యాపకులు ఎస్ కే అజిత్ బాషా, ఎం వెంకటేశ్వర్ రెడ్డి, ఉలిచి వెంకా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం జయప్రదం చేయండి

సంతనూతలపాడు: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 5న నిర్వహించే హైందవ శంఖారావ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎస్ నాయకులు ఉపాధ్యాయులు, వీ మార్కండేయులు కోరారు. సంతనూతలపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారు మాట్లాడుతూ హిందూ దేవాలయాల్లో హిందువులు మాత్రమే పూజలు కొనసాగించాలన్నారు. డిసెంబర్ 7న గీతా జయంతి సందర్భంగా ప్రతి ఆలయంలో సామూహిక హారతి కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు టీ శ్రీనివాసరావు కోరారు. ప్రతి గ్రామంలో హిందూత్వం బలపడేలా ఇంటింటా గీతా పారాయణం, భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ పాలకులు ఆర్ రాంప్రసాద్, నిర్వాహక సభ్యులు మధు, సంజీవరెడ్డి, ఆత్రేయ, రామారావు, చెంచిరెడ్డి, శివరామకృష్ణ, మహేష్ దత్తు, పీ శివరామకృష్ణ, వేమూరి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక నర్తనం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఒంగోలు మెట్రో: కార్తీక మాసం ముగింపు సందర్భంగా ఒంగోలు కేశవ స్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద ఆదివారం రాత్రి చందు డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. నృత్య ప్రదర్శనలో 80 మంది విద్యార్థులు పాల్గొనగా మాస్టర్ చందు, ఆకుల బాలకోటయ్య, ఈఓ శివశంకర్ పర్యవేక్షించారు.

జేఎంబీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న క్లౌ యూనియన్ యూత్ సభ్యులు

ఒంగోలు మెట్రో: స్థానిక జేఎంబీ చర్చిలో ఆదివారం రాత్రి క్లౌ యూనియన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు గీతాలు, నృత్య రూపకాలతో యువత అలరించారు. కేక్ కటింగ్ అనంతరం పాస్టర్ కెనడీ వాక్యోపదేశం అందించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌ యూనియన్ చైర్మన్ కె.హెరాల్డ్ మోజెస్, డైరెక్టర్లు జి.వందన, టీఎస్ రంజితం, కమిటీ చైర్మన్ కె.పద్మ జోషి, సెక్రటరీ వై.రాజశేఖర్, ట్రెజరర్ జగజ్జీవన్‌రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు



మంచికలపాడు వద్ద నాటుకు సిద్ధంగా వరి నారు



వరి నారు కట్టలు కడుతున్న మహిళలు



వరి నాట్లు వేస్తున్న మహిళలు

ఆశల వరి

● సిద్ధమవుతున్న నారు మడులు ● రెండో పంటగా మళ్లీ వరి సాగు చేస్తున్న రైతులు



సత్తువ మందు చల్లుతున్న రైతన్న

చీమకుర్తి రూరల్:

ఖరీఫ్ ప్రారంభంలో తీవ్ర వర్షాభావం, ఆగస్టు నుంచి భారీ వర్షాలతో పంటల దిగుబడులు పడిపోయి రైతులు నష్టపోయారు. దిగుబడులకు గిట్టుబాటు ధర లేకపోవడం వారిని మరింత కుంగదీసింది. అయినా ఆశ చావక రెండో పంటగా వరి పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నారు మడులు సిద్ధం చేసుకోగా..పొలాల్లో బురద సేద్యం చేయిస్తున్నారు. ఈ వరి పంటైనా ఆదుకోకపోతుందా అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చీమకుర్తి మండలంలోని రైతులకు ఖరీఫ్ సీజన్ కలిసి రాలేదు. నూగు, సజ్జ, మొక్కజొన్న, మినుము, మిర్చి, పత్తి వంటి పంటలు రైతులను బాగా దెబ్బతీశాయి. వాతావరణం అనుకూలించకపోవడం, తుపాను పంటలను ముంచెత్తడంతో దిగుబడులు భారీగా తగ్గాయి. వాటికి తోడు గిట్టుబాటు ధర లేక నష్టాలు చవిచూశారు. చేసేదిలేక రైతులు నూగు పంటను దున్నేశారు. ప్రస్తుతం రెండో పంటలోనైనా లాభాలు దక్కుతాయన్న ఆశతో రైతులు వరి సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ట్రాక్టర్లతో బురద సేద్యాలు చేయించి నారు మడులను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే మండల కేంద్రం చీమకుర్తి తో పాటు మంచికలపాడు, పడమటి నాయుడుపాలెం, బండ్లమూడి, పాటిమీదపాలెం, తొర్ర గుడిపాడు, రామచంద్రపురం, చినరావిపాడు, తదితర గ్రామాల్లో నారుమడులు సిద్ధం చేశారు. కయ్యల్లో నారు ఏపుగా పెరుగుతోంది. మరో వైపు నారు నాటేందుకు పొలాల్లో ట్రాక్టర్లతో బురద సేద్యాలు చేయిస్తున్నారు. ఖరీఫ్ లో మండలంలో దాదాపు 600 ఎకరాల్లో వరకు వరిపంట సాగు చేయగా రబీలో 1000 ఎకరాల్లో సాగు కావచ్చని వ్యవసాయ శాఖ ఏఓ డీవీ భాస్కర్ అంచనా వేస్తున్నారు. అలాగే నూగు పంట తొలగించిన పొలాల్లో కూడా రెండో పంటగా వరి వేస్తున్నారు.



ట్రాక్టర్ సాయంతో వరి నారు తరలిస్తున్న రైతు



వరి నాటుకు సిద్ధం చేసిన మాగాణి కయ్య

హింసకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలి



కార్యక్రమంలో మహిళలతో మాట్లాడుతున్న మాలతి

సంతనూతలపాడు: సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని ఐద్వా మండల కార్యదర్శి ఎస్ మాలతి పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలను అరికట్టాలని ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో మహిళలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మహిళలపై చిన్నారులపై జరుగుతున్న ఘోరాల వలన క్రైమ్ రేటు విపరీతంగా పెరిగిపోతోందన్నారు. రాష్ట్రం మద్యం, మత్తు పదార్థాలకు నిలయంగా మారిందని అన్నారు. మద్యం, మత్తు పదార్థాలు నిషేధించాలని, హింసను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలపై హింసను వ్యతిరేకించే వారందరూ ఐద్వా కార్యక్రమాలను బలపరచాలని, భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఐద్వా నాయకురాలు కే బుజ్జి అధ్యక్షత వహించగా నాయకులు ఎస్ కే నాగూర్ బీ, కే లక్ష్మీ, ఎస్ మేఘన పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు ముగిసిన అన్నదానం



గురుస్వామి, ఉప సర్పంచ్ కుంచాల అంజయ్య దంపతులను సన్మానిస్తున్న మాలధారులు

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు గ్రామ అంకమ్మ తల్లి దేవస్థానంలో గురు స్వామి, ఉప సర్పంచ్ కుంచాల అంజయ్య మారుతీ దేవి దంపతుల ఆధ్వర్యంలో 30 రోజులుగా నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాముల అన్నదాన కార్యక్రమాలు ముగిశాయి. గురుస్వామి అంజయ్య ఆధ్వర్యంలో రెండేళ్ల నుంచి ఎండ్లూరులో అయ్యప్ప తదితర మాలలు ధరించిన భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం ప్రారంభం నాడు నవంబర్ రెండో తేదీ అయ్యప్ప స్వాములకు అన్నదానం ప్రారంభించి ఆదివారం ముగించారు. కార్యక్రమంలో గురుస్వాములు ఎల్.రామాంజనేయులు, డి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, మాజీ ఎంపీపీ దుంపా చెంచిరెడ్డి, ఎండ్లూరు సర్పంచ్ ఎస్.పుల్లయ్య, ఎంపీటీసీ కే.వెంకటేశ్వరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యల్లమందారెడ్డి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ఒంగోలులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి

● సీపీఎం ఒంగోలు నగర కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.700 కోట్లు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని సీపీఎం కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు రమేష్ అధ్యక్షతన నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని, పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. వర్షాలు పడితే రోడ్లన్నీ జలమయమవుతున్నాయన్నారు. నగరంలో వస్తున్న మురుగు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో రోడ్లపైకి చేరి చెరువుల్లా కనిపిస్తున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ జోక్యం చేసుకుని స్మార్ట్ సిటీ కింద నిధులు కేటాయించి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ప్రణాళికా బద్ధంగా నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు, ఎం.వీరాస్వామి, నగర నాయకులు హుస్సేన్, బీవీరావు, టి.మహేష్, కె.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, దారా వెంకటేశ్వర్లు, జి.ఆదిలక్ష్మి, జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

మాగుంట సుబ్బరామరెడ్డికి ఘన నివాళి



సుబ్బరామరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఒంగోలు ఎంపీ మాగుంట, ఎస్పీ దామోదర్ తదితరులు

ఒంగోలు సబర్బన్: దివంగత ఎంపీ మాగుంట సుబ్బరామరెడ్డికి ఆదివారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో సుబ్బరామరెడ్డి 29వ వర్ధంతి సభను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించారు. సుబ్బరామరెడ్డి వారసులతోపాటు రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాతతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు నివాళులర్పించారు.

అల్లూరు(కొత్తపట్నం): మండల అభివృద్ధిలో మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామరెడ్డి కృషి ఎంతో ఉందని మాజీ వీఆర్వో వీరేపల్లి రామచంద్రారెడ్డి, మడనూరు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సామంతుల వీరారెడ్డి కొనియాడారు. అల్లూరు, మడనూరు గ్రామాల్లో సుబ్బరామరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అల్లూరు సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఉప సర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ స్వర్ణ శివారెడ్డి, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, వెంకారెడ్డి, వేణు రామకృష్ణారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్రాహ్మణ కార్తీక సమారాధన



సహపంక్తి భోజనాలు చేస్తున్న బ్రాహ్మణులు

ఒంగోలు మెట్రో: కార్తీక మాసం ముగింపు సందర్భంగా ఆదివారం ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడు చెరువు వద్ద ఫ్యాన్సీ గూడ్స్ అసోసియేషన్ హాల్లో సమారాధన నిర్వహించారు. 1,600 మంది బ్రాహ్మణులు సామూహిక కార్తీక సమారాధనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. బ్రాహ్మణ నిర్వహణలో ఉన్న శివాలయం, నూతన ఆబ్దిక భవనానికి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్య రూ.2 లక్షలు, ఆయన కుమార్తెల తరపున రూ.లక్ష, దుర్గా బుక్ డిపో యజమాని రావినూతల మోహన్‌రావు రూ.50 వేల విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు సీవీఎల్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్య, కార్యదర్శి గంజాం రంగనాథ ప్రసాద్, సహాయ కార్యదర్శి సముద్రాల భీమశంకర్ శాస్త్రి, కోశాధికారి పింగళి పూర్ణచంద్రరావు, సమితి సభ్యులు మైనంపాటి సాయి, మద్దులూరి హరి ప్రేమ్ నాథ్. శనగవరపు శివకుమార్, వ్యామజాల ప్రసన్న కుమార్. ఎం.శ్రీనివాసరావు(వాసు), పునుగోటి నాగ కిరణ్ కుమార్, మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యాదవుల కార్తీక వన మహోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

కొత్తపట్నం: యాదవుల కార్తీక వన భోజన మహోత్సవాన్ని ఆదివారం కొత్తపట్నం సమీపంలోని నల్లూరి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చీరాల, ఒంగోలు ఎమ్మెల్యేలు ఎంఎం కొండయ్య, దామచర్ల జనార్దన్‌రావు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు రాచగర్ల వెంకట్రావు నేతృత్వంలో నిర్వహించిన సభలో అతిథులు ప్రసంగించారు. యాదవులు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని ఆకాంక్షించారు. సాటి మనిషిని గౌరవించడం నేర్చుకోవాలన్నారు. సముద్రస్నానం అనంతరం నల్లూరి గార్డెన్‌లో శాంతిహోమంలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ మెంబర్ కృష్ణమూర్తి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, మాజీ గృహ నిర్మాణ శాఖ డీఈ లక్ష్మీనారాయణ, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ కాటం అరుణమ్మ, కొత్తపట్నం తహసీల్దార్ పి.మధుసూధన్‌రావు, బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జి యోగయ్య అంకమ్మరావు, ఎస్.కోటేశ్వరావు, కాకు రవి, వైవీ సుబ్బారావు, కొటారు శ్రీనివాసులు, కొటారు నాగేశ్వరరావు, గోళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వెండితెరపై సంచలనం టి.కృష్ణ

● వర్ధంతి సభలో సాహితీవేత్తలు, వామపక్ష నేతలు



టి.కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ఒంగోలు మెట్రో: ప్రజానాట్యమండలి కళాకారుడు, సంచలన సినీ దర్శకుడు టి.కృష్ణ 38వ వర్ధంతి కార్యక్రమాన్ని ఏపీ ప్రజానాట్య మండలి, కృష్ణ మెమోరియల్ స్కూల్, కృష్ణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కృష్ణ కల్చరల్ సొసైటీ సభ్యుడు వి.సింగయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసం, ప్రజా చైతన్యం కోసమనే సిద్ధాంతాన్ని నమ్మిన దర్శకుడు టి.కృష్ణ అని కొనియాడారు. ఆయన దర్శకత్వం వహించిన ఆరు చిత్రాలను ఆణిముత్యాలుగా అభివర్ణించారు. మూస పద్ధతిలో సాగుతున్న సినీ రంగంలో ప్రజా సమస్యలే ఇతివృత్తాంతంగా మాదాల రంగారావు, టి.కృష్ణ పెను సంచలనాలు సృష్టించి చిరస్థాయిగా నిలిచారన్నారు. టి.కృష్ణ తనయుడు సినీ హీరో గోపీచంద్ విదేశాల్లో షూటింగ్లో ఉన్నందున ఈ ఏడాది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించలేకపోతున్నామని చెప్పారు.

డాక్టర్ నాగబోయిన ఆదినారాయణ మాట్లాడుతూ.. వెండితెరపై వామపక్ష భావాలను చూపి గొప్ప విజయాలు సాధించిన మాదాల రంగారావు, టి.కృష్ణ జిల్లా వాసులు కావడం గర్వకారణమన్నారు. ప్రముఖ కవి పొన్నూరి శ్రీనివాసులు, డాక్టర్ నూనె అంకమ్మరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, మల్లికార్జున తదితరులు ప్రసంగించారు. ముందుగా టి.కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభ అనంతరం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చిడిపోతు వెంకటేశ్వర్లు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సూదనగుంట ఫౌండేషన్ సభ్యులు

సంతనూతలపాడు: మండలం కేంద్రంలోని హైస్కూల్ ప్రాంగణంలో ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు సూదనగుంట ఫౌండేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ఐ డాక్టర్ సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు సూదనగుంట కృష్ణమూర్తి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కర్ రావు తెలిపారు. స్థానిక హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు ఫ్లడ్ లైట్స్ వెలుగుల్లో క్రీడా మ్యాట్‌పై కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. 5 వేల మంది తిలకించేందుకు గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. 26 టీములు స్త్రీ, పురుషులకు సంబంధించి ఈ కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల్లో 44 మ్యాచ్ లు జరుగుతాయన్నారు. 85 కేజీలు లోపు పురుషులు, 75 కేజీలు లోపు స్త్రీలు ఈ రాష్ట్ర స్థాయి సీనియర్స్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారిని రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయికి ఎంపిక చేయనున్నట్లు అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, హైదరాబాద్ డీఎస్పీ అన్నూ వేణుగోపాల్ వెల్లడించారు. సమావేశంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై పూర్ణచంద్రరావు, దాసరి రమేష్, వైస్ ప్రెసిడెంట్ కే ప్రసాద్ రావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లు ఆరికట్ల సుమతి, సిరిగిరి రంగారావు, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు ఎం.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

చీమకుర్తి రూరల్: ప్రజలపై భారాన్ని మోపే విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయడంతో పాటు స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలని చీమకుర్తి మండల యూత్ అధ్యక్షుడు మోపూరి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలపై విద్యుత్ భారాలు వేయవద్దని కోరారు. గత ప్రభుత్వ హయాంలో బాదుడే బాదుడు అని ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం అధికారం రాగానే విద్యుత్ రూపంలో భారం వెయడం మంచిది కాదన్నారు. రైతులు, కార్మికులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే ఆపాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ప్రస్తుతం చీమకుర్తిలో చిన్న, మధ్య తరగతి వ్యాపార సంస్థలతో సహా 400 వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు పెట్టారని చెప్పారు. నివాస గృహాలకు మీటర్లు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్ కు స్మార్ట్ మీటర్ పెట్టడం నమ్మకద్రోహమేనని విమర్శించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ లో బ్యాలెన్స్ అయిపోగానే పేదలకు అంధకారమే మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికంగా వినియోగించే రాత్రి వేళల్లో అధిక రేట్లు వసూలు చేయటం నడ్డి విరిచే భారం కాదా అని ప్రశ్నించారు. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఎసరుపెట్టేందుకే పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారని మండిపడ్డారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం



కళ్యాణ మహోత్సవ వేడుకలో గ్రామస్తులు

సంతనూతలపాడు: మండలం కేంద్రంలోని నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం నాడు కార్తీక మాస బహుళ అమావాస్య పర్వదినాన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అర్చకులు ఆదిమూలం శ్రీ సాయి శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి కళ్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సన్నమూరి సుబ్బనాచారి, బూదాటి శ్రీనివాసరావు, మోదుకూరి రాజేష్ గుప్తా, తన్నీరు శరత్ బాబు, వేమా ప్రభాకర్ రావు, కుంచాల కొండమ్మ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షురాలు, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, మాజీ ఎంపీపీ చెంచిరెడ్డి దంపతులు భక్తుల అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలను స్వీకరించారు.